భూసారం పెంపుతో నాణ్యమైన దిగుబడులు

- డీసీపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్



రైతులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తదితరులు

ఆత్మకూరురూరల్: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో భూమిలో నవధాన్యాలు చల్లడం ద్వారా పొలం సారవంతం అవుతుందని, తద్వారా నాణ్యమైన పొగాకు దిగుబడులు సాధించవచ్చని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ తెలిపారు. ఆత్మకూరు మండలంలోని నెల్లూరుపాళెంలో క్లస్టర్ పరిధిలోని రైతులకు శుక్రవారం ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై నిర్వహించిన క్షేత్రోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పొగాకు పంటలో పురుగుమందుల అవశేషాలు లేని దిగుబడులు సాధించడం ప్రధానమన్నారు. ప్రపంచవ్యాప్తంగా నాణ్యమైన దిగుబడులు సాధించిన పొగాకు రైతులు లాభాలు ఆర్జిస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని పంటల సాగులో పురోగతి సాధించాలని తెలిపారు. పొగాకు బోర్డుతోపాటు సీటీఆర్ఐ సిఫార్సు చేసిన పురుగుమందులను అవసరమైన మేరకే వాడాలని సూచించారు. నెల్లూరు జిల్లాలో మార్చి 9వ తేదీ నుంచి పొగాకు వేలం కేంద్రాలు ప్రారంభించేందుకు పొగాకు బోర్డు నిర్ణయించిందని, రైతులు ఈ లోపు పొగాకు గ్రేడింగ్ పూర్తి చేసి తమ ఉత్పత్తుల విక్రయాలకు సిద్ధం కావాలని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసి ప్రతిభ చూపిన రైతులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో పొగాకు వేలం కేంద్రం క్షేత్రాధికారి ఆదర్శ్ జగన్నాథ్, ఐటీసీ, జీపీఐ పొగాకు కొనుగోలు కంపెనీల ప్రతినిధులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, వ్యవసాయ విస్తరణాధికారి కోనేపల్లి కృష్ణవేణి, కాశీవీరనారాయణ, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం


మహిమలూరులో మాట్లాడుతున్న వల్లభనేని రాజేంద్ర

ఆత్మకూరురూరల్: వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతమయ్యేలా స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గృహ సారథులు పనిచేయాలని ఆత్మకూరు మండల సచివాలయాల కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర తెలిపారు. మండలంలోని మహిమలూరు, నువ్వూరుపాడు సచివాలయాల పరిధిలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలకు అనుగుణంగా ప్రతి గ్రామంలో పార్టీ పటిష్టతకు సమష్టిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మహిమలూరు సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, నాయకులు గడ్డం శ్రీనివాసులురెడ్డి, ముక్కమళ్ల రఘురామిరెడ్డి, దనాల రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పడమటినాయుడుపల్లి వద్ద పెద్దపులి కలకలం

మర్రిపాడు: మండలంలోని పడమటినాయుడుపల్లి సమీపంలో మల్లెంకొండ అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరించినట్లు ఆనవాళ్లు ఉన్నాయన్న సమాచారంతో గ్రామంలో కలకలం రేగిందని శుక్రవారం గ్రామస్తులు తెలిపారు. పెద్దపులి పాదముద్రలు ఉన్నాయని చెబుతున్నారే కానీ ఎవరూ చూడలేదన్నారు. అయితే నల్లవాగు ప్రాంతంలో సంచరించినట్లు అడుగులు ఉన్నాయని తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే ఇన్‌చార్జి డీఆర్‌ఓ రవీంద్రబాబు నేతృత్వంలో అటవీ సిబ్బంది గ్రామంలో పరిశీలించారు. ప్రస్తుతం తాము పూర్తిస్థాయిలో వివరాలు సేకరిస్తున్నామని, పెద్దపులి వల్ల ఎవరూ ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని ఇన్‌చార్జి డీఆర్‌ఓ ధైర్యం చెప్పారు.

నేటి నుంచి జాగృతి ఉద్యమం

కలిగిరి: జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో శనివారం నుంచి 'మానవత – నైతికత' నినాదంతో రాష్ట్రవ్యాప్త జాగృతి ఉద్యమం నిర్వహిస్తున్నామని ఆ సంస్థ మండల అధ్యక్షుడు షేక్ ఖాజాఅహమద్ తెలిపారు. స్థానిక అమన్ మసీదులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాగృతి ఉద్యమం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు నాయబ్‌రసూల్, మీరావలి, హుస్సేన్, మస్తాన్‌వలి, అబ్దుల్లా, ఇస్మాయిల్, రఫి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వండి

ఆత్మకూరురూరల్: ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ 20వ వార్డు కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరు తహశీల్దారుకు లక్ష్మీనరసింహంకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఒంటేరు మల్లికార్జున, సుధాకర్‌రెడ్డి, సభ్యులు బెంజిమెన్, శ్రీకాంత్, నాగేశ్వరరావు, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, పెంచలరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు నివారించేలా చర్యలు


రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుడి బ్యాగ్ తనిఖీ చేస్తున్న ఎస్సై అరుణకుమారి

కావలిరూరల్: రైళ్లలో దొంగతనాలు, మద్యం, గంజాయి అక్రమ తరలింపును నివారించేలా అన్ని చర్యలు తీసుకుంటామని కావలి రైల్వే ఎస్సై అరుణకుమారి తెలిపారు. పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో శుక్రవారం పార్శిల్ విభాగం, ప్రయాణికులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రైళ్లలో తిరుగుతూ దొంగతనాలకు పాల్పడుతున్న వారి ఆట కట్టించేలా గుంతకల్ రైల్వే ఎస్పీ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రయాణికులు తమ విలువైన వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని, ఎవరిమీదైనా అనుమానం ఉంటే వెంటనే రైల్వే పోలీసులకు తెలియజేసి సహకరించాలని కోరారు.

భూఆక్రమణపై ఫిర్యాదు

ఉదయగిరి: మండలంలోని దాసరపల్లిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని అక్రమార్కుల చెర నుంచి విడిపించాలని పలువురు గ్రామస్తులు శుక్రవారం ఉదయగిరిలో తహసీల్దార్‌సానా శ్రీనివాసులురెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సర్వే నంబర్.1056లో 290 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూమి ఉండగా గతంలో ఈ భూమిని అటవీశాఖకు బదలాయింపు జరగ్గా దానిని అడ్డుకున్నామన్నారు. ప్రస్తుతం ఆ భూమిలో కొంతమంది వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి యంత్రాలతో ముళ్ల చెట్లు తొలగించి చదును చేస్తున్నారన్నారు. వెంటనే అధికారులు తగు చర్యలు తీసుకొని ఆక్రమణలను ఆపాలని కోరారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలు

ఆత్మకూరు: విద్యార్థి దశ నుంచే మాదక ద్రవ్యాలు వినియోగిస్తే కలిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఈబీ అధికారులు సూచించారు. స్థానిక మున్సిపల్ పరిధిలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో ఎస్ఈబీ సీఐ బి.నయనతార నేతృత్వంలో శుక్రవారం మాదవ ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను ప్రభుత్వం నిషేధించిన క్రమంలో వాటిని రవాణా చేసినా, విక్రయించినా తీవ్ర నేరమని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల విక్రయాలపై సమాచారం తెలిస్తే ఎస్ఈబీ అధికారులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మాదక ద్రవ్యాలు సేవిస్తే శారీరకంగా కలిగే నష్టాల గురించి విద్యార్థులకు చిత్రరూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్సై మొగల్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన


బీకే అగ్రహారంలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఏపీఓ శ్యామల

జలదంకి: మండలంలోని బీకే అగ్రహారం, బ్రాహ్మణక్రాక గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఏపీఓ శ్యామల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీలందరూ ఇచ్చిన కొలతల ప్రకారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పనులు చేయాలని, కచ్చితమైన హాజరు ఉండాలని తెలిపారు. ఉపాధి కూలీల సంఖ్య, వారికి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు ఉపాధి పనులను ప్రతిచోటా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. కూలీల సంఖ్యను పెంచాలని క్షేత్ర సహాయకులకు సూచించారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు జనార్దన్, వేణు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సీనియర్ ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు


సాంస్కృతిక నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

కొండాపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు అధ్యాపకులు, జూనియర్ ఇంటర్ విద్యార్థులు శుక్రవారం వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఎం.శ్రీహరి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ చదివే వయస్సులోనే విద్యార్థులు వ్యసనాలకు బానిసలవుతున్నారని, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. త్వరలో జరగనున్న పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం ఇటీవల జరిగిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సాయంత్రం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ధాన్యం కొనుగోలు కేంద్రాలతో ప్రయోజనం


కొండాపురం: మాట్లాడుతున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

కొండాపురం: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు ప్రయోజనకరమని తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్య తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటను ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. ఆన్‌లైన్ విధానంలో మిల్లుల కేటాయింపు ఉంటుందని, మిల్లర్లు ధాన్యం తీసుకెళ్లిన తర్వాత ధాన్యం నాణ్యత లేకపోయినా రైతులకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. వ్యవసాయాధికారి ప్రసూన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు ముందుగానే వారి పరిధిలోని రైతుభరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. కొండాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిమ్మిలి రాజేంద్రప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ధాన్యానికి మద్దతు ధర

జలదంకి: రైతుభరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధ్యాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించుకొని మద్దతు ధర పొందాలని కావలి పౌరసరఫరాలశాఖ డీటీ సురేష్‌బాబు తెలిపారు. ధాన్యానికి మద్దతు ధరపై శుక్రవారం మండలంలోని చామదల ఆర్‌బీకేలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ శైలజ, వీఏఏ ప్రసాద్, వీఆర్వో చెన్నకృష్ణయ్య, రైతులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు వసూలు చేయాలి

మర్రిపాడు: మండలంలో నూరుశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని కావలి డివిజనల్ పంచాయతీ అధికారి ఆదినారాయణరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలన్నారు. ఈ నెలాఖరు లోపు నూరుశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో అనధికారికంగా వేస్తున్న లేఅవుట్లను గుర్తించి వారికి నోటీసులు ఇవ్వాలని తెలిపారు. పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ మస్తాన్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి


కరటంపాడులో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ దేవసేన

ఆత్మకూరురూరల్: రైతులు తాము సాగు చేస్తున్న పంటలను తప్పనిసరిగా ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని, తద్వారా ప్రభుత్వ రాయితీలు అందుతాయని ఆత్మకూరు సబ్ డివిజన్ వ్యవసాయశాఖ ఏడీఏ దేవసేన తెలిపారు. మండలంలోని కరటంపాడులో సాగులో ఉన్న పంటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. అనంతరం మండల వ్యవసాయాధికారి కిషోర్‌బాబుతో కలిసి వ్యవసాయశాఖ సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వే నంబర్ల వారీగా ప్రతి పంట ఈ–క్రాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు యస్దానీ, వీఆర్‌ఓ ప్రతాప్, వీఆర్‌ఏ బ్రహ్మయ్య, వలంటీర్ ఖాజారసూల్, రైతులు పాల్గొన్నారు.

పంట నమోదు ప్రక్రియ పరిశీలన

చేజర్ల: మండలంలోని పలు గ్రామాల్లో పంట నమోదు ప్రక్రియను వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. మడపల్లి, తిమ్మాయపాలెం, చిత్తలూరు గ్రామాల్లో పంట నమోదు ప్రక్రియను పొదలకూరు ఏడీఏ శివనాయక్ తనిఖీ చేశారు. పంట సాగు చేసిన రైతులంతా ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శశిధర్, చేజర్ల సర్పంచ్ వెంకటేశ్వర్లు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మేకపాటికి ప్రత్యేక కృతజ్ఞతలు

సోమశిల: అనంతసాగరం మండలంలో నూతనంగా స్త్రీశిశు సంక్షేమశాఖ ద్వారా చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని మంజూరు చేయించిన మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి మండల ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు.

పాలలక్ష్మమ్మకు పూజలు


ప్రత్యేక అలంకరణలో పాలలక్ష్మమ్మ అమ్మవారు

ఉదయగిరి: మండలంలోని సున్నంవారిచింతల గ్రామంలో కొలువైన శ్రీడిల్లీ పాలలక్ష్మమ్మ ఆలయ ఐదో వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం అమ్మవారికి అభిషేకం, పూజలు, హోమాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు.

త్వరలో నూతన భవనం ప్రారంభం



ఉదయగిరి: పట్టణంలోని ఉపఖజానా కార్యాలయాన్ని త్వరలో ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని జిల్లా ట్రెజరీ అధికారి గంగాద్రి పేర్కొన్నారు. స్థానిక ఉపఖజానా కార్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మరో నెల రోజుల్లో నూతన భవన నిర్మాణ పనులు పూర్తవుతాయని తెలిపారు. వింజమూరులో నిర్మిస్తున్న నూతన భవనం కూడా ప్రారంభమవుతుందన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఉపఖజానా అధికారిణి మమత, సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సోమశిల: అనంతసాగరం మండలం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ మురళి శుక్రవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

గిరిజనుల కష్టాలు పరిశీలించండి

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని అనంతరాయనియేని గిరిజనకాలనీలో గిరిజనులకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారి కష్టాలను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని యానాదుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తిన లక్ష్మణశేఖర్ కోరారు. అనంతరాయనియేనిలో శుక్రవారం ఆయన స్థానికులతో కలిసి అనేక విషయాలపై చర్చించారు.

నేడు యథావిధిగా పాఠశాలలు

ఉదయగిరి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు యథావిధిగా తెరవాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో శనివారం సెలవు దినం అయినప్పటికీ సంక్రాంతి సెలవుల్లో ఒకరోజు అదనంగా సెలవు ఇచ్చిన నేపథ్యంలో రెండో శనివారం పనిదినంగా భావించి ఉపాధ్యాయులు, సిబ్బంది విధులకు హాజరుకావాలని తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఒక్కో పంచాయతీకి సంబంధించిన సమస్యలపై ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోని సమస్యలను ప్రజాప్రతినిధులు తన దృష్టికి తీసుకువచ్చారని, వాటన్నింటినీ త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. రాష్ట్రంలో అన్నిప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. నవరత్నాల సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి దాదాపు రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందని తెలిపారు. అందరికీ మేలు చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వేణమ్మ, ఎంపీపీ శశిరేఖ, వైస్ ఎంపీపీ సురేంద్ర, ఏఎంసీ వైస్ చైర్మన్ ఊటు శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్‌లతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు నీలం సాయికుమార్, మేడా కృష్ణ, దైవాదీనం, షేక్ ఉస్మాన్‌షరీఫ్, సామంతుల సురేష్‌రెడ్డి, సాధిక్‌రెడ్డి, మధురెడ్డి, తాండ్ర మల్లి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన


అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

ఉదయగిరి: మండలంలోని బండగానిపల్లి, జి.చెర్లోపల్లి తదితర పంచాయతీల్లో శుక్రవారం కేంద్ర పథకాల అమలు తీరును కేంద్ర బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా బిజ్జంపల్లిలో ఉపాధి హామీ పథకం పనులు, రైతుభరోసా, జలజీవన్ మిషన్, పెన్షన్లు, స్వయం ఉపాధి సంఘాల జీవనోపాధి కల్పన, వ్యవసాయం, వందశాతం టీకాల అమలు తదితర పథకాల అమలు తీరుపై సంబంధిత అధికారులతో వారు చర్చించారు. అనంతరం పలువురు లబ్ధిదారులను కలిసి పథకాల అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. తదుపరి సచివాలయాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఇందులో జాతీయస్థాయి మూల్యాంకన కమిటీ ప్రిన్సిపల్ కోఆర్డినేటర్ అంబటి శ్రీనివాసులు, సహాయ కోఆర్డినేటర్ కిరణ్‌తోపాటు పలువురు సభ్యులు ఉన్నారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధి హామీ అడిషనల్ పీడీ నిర్మలాదేవి, సర్పంచ్ లక్కు రమణమ్మ, హౌసింగ్ డీఈ శ్రీనివాసులు, వైద్యాధికారిణి శివకల్పన, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, చినబాబు, ఏపీఓ వెలుగోటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కావలి విద్యార్థులు

కావలి: పట్టణంలోని విశ్వోదయ పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ పి.జోసఫ్ సుకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కోచ్ మాట్లాడుతూ బాస్కెట్‌బాల్ అండర్–17 విభాగంలో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరచిన షేక్ నిహాల్‌రసూల్, షేక్ వసీమ్ రోహన్, సీహెచ్ మదన్, కె.ఎల్.శ్రీనివాసులు, కె.ఎల్.నరసింహ, ఎం.అరుణ్‌కుమార్, పి.జాషువా, వి.సుమంత్ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికయ్యారని తెలిపారు. విజయవాడలోని సిద్దార్థ పాఠశాలలో ఈ నెల 11వ తేదీ నుంచి జరిగే రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో వారు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని శుక్రవారం ఆ పాఠశాలలో కోచ్, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి


పెద్దకొండూరులో సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ కనకదుర్గాభవాని

కలిగిరి: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయాల్సిన బాధ్యత గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లపై ఉందని డీఎల్‌డీఓ కనదుర్గాభవాని తెలిపారు. మండలంలోని పోలంపాడు, పెద్దకొండూరు గ్రామ సచివాలయాలను శుక్రవారం ఆమె సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్లు గ్రామాల్లో గర్భిణులు, పిల్లలు, విద్యార్థుల పూర్తి వివరాలతో ఎస్‌జీడీ సర్వే నిర్వహిస్తున్నారన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రభుత్వ పథకాలు, సచివాలయాల్లో అందించే సేవల గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.కళాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం


వార్షికోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

మర్రిపాడు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జూనియర్ కళాశాల ప్రారంభించి 22 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ వేడుకలు నిర్వహించారు. పూర్వవిద్యార్థుల కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ హనుమంతరాజు, అధ్యాపకులతోపాటు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చెన్నకృష్ణయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు


కలిగిరి: నాగసముద్రంలో ఫ్లెక్సీ తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది


అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలో వైఎస్సార్, ఎన్టీఆర్ విగ్రహాలకు వేసిన ముసుగులు

కలిగిరి: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ఆర్.కళాధర్‌రావు తెలిపారు. కలిగిరిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను తొలగిస్తున్నామన్నారు. నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఫ్లెక్సీలు తొలగించాలి

ఆత్మకూరురూరల్: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల నియమావళిని మండలంలోని అన్ని గ్రామాల్లో అమలు చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఆత్మకూరులోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగించాలని, నేతల విగ్రహాలకు ముసుగులు వేయాలని, సచివాలయాల్లో ఉన్న రాజకీయ నాయకుల ఫొటోలు కనిపించకుండా పేపర్లు అంటించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ విషయంలో సమస్యలు తలెత్తితే అధికారుల దృష్టికి తేవాలన్నారు.

విగ్రహాలకు ముసుగులు

అనుమసముద్రంపేట: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లు తహసీల్దార్ సుభద్ర తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో శుక్రవారం ఏఎస్‌పేటతోపాటు పలు గ్రామాల్లోని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసినట్లు ఆమె తెలిపారు. అంతేకాక సచివాలయం, పంచాయతీ భవనాలు, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రభుత్వ వాల్‌పోస్టర్లను తొలగించినట్లు తెలిపారు.